# భ్రాంతులు - కలలు

చల్లని పిల్లవాయువులు వీచుచుండెను. సూర్యుఁడు పడమటిదిన నల్లని మేఘములమధ్య కనపట్టుచుండె. అంతకుమున్న వర్షము కురిసియుండుటంబట్టి వాపీకూప తటాకాదులు జలమయంబులైయుండ, ప్రకృతిరమ యొక నూతన శోభవహించి నట్లుండెను.

ఆ సమయంబున నొక సెలయేటింజేరి, దానిమధ్యనుండిన యొక చట్రాతిమీఁద చతికిలఁబడితిని అవ్వాహిని నెవ్వరపాటునం జూచుచు, చకితుండనైతిని. అప్పుడప్పుడ ప్రొద్దుగ్రుంకుచుండెను. సూర్యకిరణములా ప్రవాహపు నీటిమీఁద ప్రతిఫలించుచుండ, చూచుటకెంతయు రమ్యముగా నుండెను. దానిని కనుగొంటిని. ఉన్మత్తుఁడనై, మైమఱచితిని. నేనెచట ఉండినది నాకప్పుడెఱుకపడదయ్యె. ఆ యవస్థలోనూ హాప్రపంచమునం బ్రవేసించి, యారమణీయతంగూర్చి యీవిధిని తలపోయం దొడంగితిని !—

ఎఱ్ఱని వండుచే కలసి నీరుపారుచుండ చూచి, యలనాఁడు తల్లికోట యుద్ధమున మడసిన యాంధ్రుల మహోజ్వల రక్తము కరుడుకట్టియుండి నేఁడీ ప్రవాహరూపంబున ప్రవహించుచున్నదా యని భావించితి. ఆ భావ మనంతమైనది. ఒక్కనిముసము !— ఆఁ! నెత్తురేమి - వాహినీరూపంబున ప్రవహించుటేమి!! ఇట్టిది సంభవించునా? ఇప్పుడు తెలిసినది. ఇయ్యది అరుణకిరణు నిరసించు నెపంబున నిట్టివన్నెతో కనుపట్టుచున్నది. అంతె. అనుకొంటిని.

కవితావేగంబునం జిక్కి భావనాహర్మ్యమందున నెంతకాల మమరుండనై యుంటినో నాకు తెలియదు. కాని కొంతవడికి తెప్పరిలితిని. ఈప్రపంచమున బడితిని. అప్పుడు ధన్యుఁడనైతి ననుకొంటిని. ఇట్టి యవస్థ విరోధికికూడ వలదు అనుకొంటిని.

ఏమి అవివేకము! మతిచెడినవానివలె వానచే నెఱ్ఱబారి పారుచుండిన నీటిని చూచి, రక్తమని భ్రమించితిని. శాస్త్రజ్ఞుండనై (Scientist) కూడ యిట్లు పిచ్చివాఁడనగుట చూడ ఆశ్చర్యముగానున్నది! ఆంధ్రుల రక్తమెక్కడ - తల్లికోట యుద్ధమెక్కడ !!—ఎన్ని శతాబ్దములు కడచిపోయినవి. నేనొక కవివలె వెఱ్ఱినై లేనిపోని యూహలచేసి, బుద్ధిలేనివాడనైతినే. బుద్ధిజాడ్యజనితోన్మాదుండనైతినే.

ఈప్రపంచమున పిచ్చివారు మూఁడు తెగలుగా నున్నారు. పుట్టుకతోడన పిచ్చివారైనవారు మొదటితెగకుం జెందినవారు; కోరుకొని (By option) పిచ్చివారైనవారు రెండవపక్షమువారు; మూఁడవతెగవారు యేదేనొక కారణాంతరమున వెఱ్ఱివారై, కార్యము ముగిసినతోడన చక్కబడువారు. ఈ మూఁడు పక్షములవారిలోను రెండవతెగకుం జెందినవారు—కోరుకొని (By option) పిచ్చివారైనవారు.—కవులు! తక్కిన రెండుతెగలవారి పిచ్చికుదుర్చ ప్రయత్నించవచ్చునుకాని, రెండవ తెగవారిని చక్కపెట్ట నా బ్రహ్మకును సాధ్యము కానోపదు !!

కవితావేగమఁట! భావనా ప్రపంచమఁట !!—ఈ కవులు కల్లుత్రాగిన వారివలె యావేశముచే మైమఱచి, భావనా ప్రపంచ

మను లోకములోని కితరులనుకూడ ప్రవేశింపఁజూతురు. 'తాఁజెడ్డకోఁతి వనమెల్ల చెఱచె,' నన్నట్లున్నది వీరియూహ. ఆభావనాప్రపంచము గగనకుసుమంబని తెలియు లేరేమొ కవులు? మనచేతులచే దాకుచు, కన్నులచే చూచుచు, అందువసియించు యీ ప్రపంచమె స్థిరమైనది కాదనినప్పుడు, యీ యూహాప్రపంచ మెట్టిదని వేరుగా చెప్పనేల? కవులవెఱ్ఱికి తుదిమొదలు లేదు. 'కాకిపిల్ల కాకికి ముద్దయినట్లు' వెఱ్ఱికి వెఱ్ఱియే ఆనందముగా కనపట్టునేమొ?—వర్ణనలఁట! ఉత్ప్రేక్షలఁట!!—వర్ణనచేయుటకు మొదలిడెనన్న నెన్నిపద్దెములైననేమి, యెన్నిపుటలైననేమి యడ్డుదిడ్డులేక 'ఎద్దుచ్చపోయఁగ యేరులై పాఱఁగ'-అనినట్లు వెడలుచుండును. వసుచరిత్ర యొకటి చాలు నీ విషయమున నన్నింటిని మించును. భట్టుమూర్తి గనుక బ్రదికియుండిన పక్షమున కోర్టులో నాపై మానసనష్టపుదావా తప్పక చేసియుండునేమో? ఉన్నదున్నట్లు చెప్పిన కోపమేరికి రాకుండును.

ఇఁక ఉపమలటుండు, ఉత్ప్రేక్షల కంతములేదు. వానికి మనవాఙ్మయము పుట్టినిల్లు కావచ్చును. అట్లగిన రెండుపద్యముల పాదములు జ్ఞప్తికి వచ్చుచున్నవి—

“పూర్వదిగంగనా - స్ఫురితఫాలస్థలీ
దీపిత సిందూర - తిలకమనఁగ,”

అని యొకకవియు, నింకొకఁడు—

“పాంథమానసపద్మ - వనిపాడు చేయను
త్వరపడివచ్చు చౌ - దంతియనఁగ,”

అనియు సూర్యోదయ వర్ణనజేసినారు. వీరి పేరేమొ నాకు జ్ఞాపకము లేదు. ఇంతకన్నను బుద్ధిలేనితనముండునా? కవితోద్రేక ఫలములఁట ఆవ్రాతలు! పోని యాయుద్రేకము అడఁగిన పిమ్మటనైన నిజస్థితి తెలియక పోవుట చూడ ఆశ్చర్యముగా నున్నది. పూర్వదిగంగనయఁట! అంగన యీవిధి ననంగమై, శూన్యవ్యక్తియై యుండిన మనగతి-పురుషులగతి—యేమి? ఆయంగన—పూర్వదిగంగన—ఫాలమి కవివరులకు దక్క వేరొకరికి కనబడదు దానికికారణమేమొ? మఱేరికి గనఁబడని వస్తుతతి, వీఁకిమాత్రము కనబడవలెనన్న వారేకనుకట్టువిద్య నేర్చినారో? అట్టిదేదైన నున్నదాని నొక పుస్తకరూపమున ప్రచురించి పుణ్యముకట్టుకొనకూడదా? ఎంత స్వార్థపరులీ కవులు! ఇఁక రెండవకవి పిచ్చి మొదటిదానిని మించినది. 'అతనికన్న నితఁడు అర్థముహెచ్చు; అతఁడు వాలముద్రిప్ప నితఁడు శూలముద్రిప్పు'—అనినట్లున్నది. చౌదంతి యమరపురివిడచి యీ యిలకేలవచ్చెనో తెలియదు. ఆ చౌదంతి గుండ్రముగానున్నదఁట. మనయేనుఁగు లట్లుండవె. ఓహో! తెలిసినది! అది దేవలోకములోనుండునదికదా? అటువంటిదానిని చూచుట కెంతకష్టపడవలెను. ఎన్నేండ్లు తపస్సుచేయవలెను. కవి పుణ్యపురుషుఁడగుటంబట్టియే దానిని చూడగల్గెను. హృదయమొక పద్మవని! ఎట్టి యాశ్చర్యము!! 'యక్స్‌రె' పెట్టిచూచినను హృదయము పద్మమువలె కనఁబడదు కదా? వీరికెట్లు కనఁబడినదొ? అదిగదా మహాత్మ్యము. అంతేకాదు ఆ చౌదంతి కమరపురినెచటను పద్మవని కనఁబడకపోవుట చూడ చాల ఆశ్చర్యముగానున్నది. ప్రపంచమున నెన్నియో వింతలు. ఇదిదానిలో నొకటి. అంతె!

ఇఁక నొకకవి 'సుకవితా యద్యస్తి రాజ్యేనకిమ్'—అని నుడివినాఁడు. ఇంతటితో పిచ్చి ముదిరినది. ఈవాక్య మాంగ్లమున నుండు—“I am the monarch of all I

survey"—అనుదాని యర్థమును ప్రతిధ్వనించుచున్నది ఈమాట నిప్పుడు గట్టిగా పదుగురిలో చెప్పినచో, దానికి ప్రతిఫలము తప్పక అనుభవింపక తీరదు. ఇతరులేరైనను సరె—ఒక్కకవి తప్ప—యీవాక్యమును బహిరంగముగా చెప్పిన తప్పక కృష్ణజన్మస్థానమును చూడగలరు. ఇందతిశయోక్తి లేదు. ఒకవేళ కవియే అనినపక్షమున పిచ్చియాస్పత్రికి కొంపోఁబడకుండునా ? * * *

ఒక గంట. మఱల ఆవేగము. అందని మ్రాని పండ్ల కఱ్ఱుచాఁచినట్లు, కవితావేగంబున ప్రకృతిని తిలకించి దాని సొబగు నానందించి, దానిని పద్యరూపముగా లిఖించఁజాలని వానియవస్థ యింతేకాఁబోలునను కొంటి. 'చతురకవిత్వతత్త్వ పటుసంపదయొక్కరిసొమ్ము కాదు'—అని నారొకరు 'నూతనప్రియుఁడ'ను నామము సార్థకపరచు కొందును దానికీ నూతనమార్గము ద్రొక్కుదును. చూతము !

—పి. యస్. ఆచార్య, బి.ఏ.

# హృదయార్చిక

పుష్కలావర్త ఘోగ్ర నభోపథమ్ము
పగిది సంక్షుభితారవాగ్భటి జగమ్ము
నల్లత్రాచు చూపులతోడ నన్నుఁ బట్టి
తిమిర విషగళసీమ బంధించివైచె.

అపుడు జీవితాశాలేశ మరయలేక
దిగులుగొనినాఁడ నిట్టూర్పువగలతోడ;
రక్తబాష్పాల తోడఁ గైవ్రాలినాఁడ—
వికృతహాసము పుడమి రాపెడవి నించె!

నాతనువు కంపమొందె; ధాత్రీతలమ్ము
కారు మొయిలు వన్నెల నీలినోరు తెఱచి
భీకరాట్టహాసముల నా వీపుతట్టి!
తిమిర గగనాంగణమ్ము ప్రతిధ్వనించె.

చేయునది లేక ధైర్యమ్ము చేతఁ బట్టి
మూగతనమూని కనుఱెప్ప మూసినాను,
గొనబుతలఁపు, బూమాలలు గ్రుచ్చినాను;
ఒకముహూర్తంబున హృదయార్చిక వెలింగె!

ఎడఁదదివ్వె తళుకు లీను పోడిమియందు
అడఁగిపోయినది తమూసితాభ;
మురువు నగవు లొల్కు ముగ్ధప్రకృతిఁ గాంచి
పాడినాను; నాట్యమాడినాను!

తొలుత నజ్ఞాన జీమూత గళితగాథ
మసృణ తిమిరమ్ములోనట్లు మ్రగ్గినాను
అక్కటా! ఎదవెల్గు జ్ఞానార్చి మఱచి;
ఎన్ని ఒడిదొడుకులగలవి బ్రదుకున!

పగులఁగొట్టితి ధ్వాంతకవాటములను
ఎసఁగు విజ్ఞానదీపికా హేతితోడ;
తోడుతో మోదకర్పూరధుని స్రవించె,
ఎగసె నైరాస్య, మిల మధురించె తనువు

బ్రతుకుపూవుటోవరియందు వలపుఁ దేనె
తీయఁదనమిడు ప్రకృతి మాతృకకు మ్రొక్కి
ఆమెవదనానఁ బూతగీతామహస్సు,
ఉపనిషత్సూక్తి సౌరభం బొలయఁగంటి.

ఆమె గఱపెను:
"నీ హృదయార్చి నరుఁడ!
దివ్యమంగళరోచిస్సు; భవ్యభూతి;
ఈశ్వర విలాసరేఖయై శాశ్వత ప్ర
భూత విస్ఫుట సత్యసమ్మోదమగును."

"వికచమానస స్ఫురిత దీపికను బిడ్డ!
మఱచితివయేని అజ్ఞానదురితపంక
విగత సుషమయౌ నీదు జీవితసుమమ్ము;
జీవవాఱదు సుమ్మి ఆశారజమ్ము!"

—ఓలేటి సీతారామమూర్తి.